# పరివర్తన

నేను వ్రాస్తున్న కథకు ముగింపు కోసం నాలుగు రోజుల నుంచి ఎంత ఆలోచించినా తట్టకపోయేసరికి నా మెదడంతా స్థబ్దుగా మారిపోయింది. కథ వ్రాసింది అరగంటనే అయినా ముగింపు మాత్రం నాలుగు రోజుల నుంచి తట్టడం లేదు. ఎంతో అసహనంగా వుంది మనసంతా. కలంలో మాత్రం కదలిక లేదు. ఏదైనా ఒక ఊపు వుంటేనే కాని ముగింపు వ్రాయలేను అనిపించింది.

బీచ్‌కు వెడితేనన్నా ఏమైనా ఐడియా వస్తుందేమో అన్న ఆలోచనతో శ్రీమతికి చెప్పి బయలుదేరాను.

అసలు రచయితగా నా జీవితం ఈ బీచ్‌లోనే ప్రారంభమయ్యింది. సాయంకాలం ఏమి తోచకపోతే బీచ్‌కు రావడం, అక్కడ ప్రేమ జంటలను చూస్తూ ఇన్‌స్పైర్ అయి అలల ఊహాలలో తేలిపోతూ కథలు వ్రాయటం నాకు అలవాటు అయ్యింది.

అలా... పెన్ను, పేపరు పట్టుకొని సముద్రపు హోరును వింటూ... జోరుగా కథలు వ్రాస్తూ లవ్ స్టోరీ రైటర్‌గా పాఠక లోకాన్ని ఓ వూపు ఊపినప్పటినుండి 'ప్రేమ కథల ప్రేమ్ రాజ్'గా పాఠకుల హృదయాలలో నిలిచిపోయాను.

అలా నేను నా గత ఊహాలతో ఊసులాడుతున్న సమయంలో ఓ శిల్పం లాంటి అమ్మాయి మెరుపు తీగెలా నా దగ్గరికి వచ్చి 'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు వుంది. మీరు రైటర్ ప్రేమరాజ్‌లా వున్నారు' అంది.

'అలావుండటంకాదండి.! నేను నిజంగా ప్రేమ్‌రాజ్‌నే' అన్నాను.

అపుడు ఆ అమ్మాయి మొహంలో నియాన్ బల్బులా కాంతి వెలిగింది. ఎంతో సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయ్యింది.

ఆ అమ్మయి నా అభిమానురాలట. నన్ను ఎన్నో రోజుల నుంచి కలవాలనుకుంటున్నదట. ఈ రోజు అనుకోకుండా ఇలా కలిసినందుకు చాలా క్యూరియస్‌గా ఫీలయ్యిందట. నా ఆటోగ్రాఫ్ తీసుకుంది. ఎంతో చలాకిగా మాట్లాడుతుంది. నా రచనల గురించి అందులోని పాత్రల గురించి చర్చించింది. కథల లోని పాత్రలను అంత శ్రద్ధగా గుర్తుంచుకొని నన్ను విమర్శించటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆ అమ్మయి పేరు రమ్య అట. డిగ్రీ మొదటి సంవత్సరము చదువుతున్నదట. వార పత్రికలో తన కథలను రెగ్యులర్‌గా చదువుతున్నదట. ఇంట్లో బోర్‌గా అనిపించి ఇలా బీచ్‌కు వచ్చిందట. ఇక్కడ నేను పరిచయమవడం హిమాలయాలను ఎక్కినంత సంతోషపడింది.

నేను అంత పెద్ద రచయిత నేమి కాదని రాయాలనే వుత్సాహం వుండటం వలన ఆరు నెలల క్రితం రైటర్స్ వర్క్‌షాప్‌లో జాయిన్ అయ్యానని, కవితలు, కథలు మాత్రమే కాకుండా ఓ సీరియల్ కూడా వ్రాయబోతున్నానని చెప్పాలనిపించింది. కాని ఆ అమ్మాయి నన్ను పొగుడుతుండటం వల్ల నేను కూడా పెద్ద రైటర్ని అన్నట్టు ప్రవర్తించదలచాను.

ఓ అందమైన అమ్మాయిని చూసినపుడు ఓ విరబూసిన గులాబిని, సూర్యోదయం, సూర్యాస్తమయం ఇలా ప్రకృతి రమణీయమైన దృశ్యాలను చూసినపుడు మనసు స్పందిస్తుంది. అందులోనూ రచయితలకు స్వతహాగా స్పందించే గుణం ఎక్కువ.

రమ్య చాలా అందమైన అమ్మయి. ఐదడుగుల ఆరంగులాల పొడుగు దానికి తగ్గ లావు. నాజూకైన శరీరం, పెద్ద కళ్ళు, నునుపైన చెక్కిళ్ళు, సన్నని పెదవులు మెరిసే చర్మంతో వుంది. అంతకంటే ఎక్కువ ఆకర్షణీయంగా మాట్లాడుతుంది. అందులోనూ ఆ అమ్మాయి నా రచనల గురించి క్షుణ్ణంగా మాట్లాడటం వలన అరగంటలోనే సన్నిహితురాలయ్యింది.

ఇంకో అరగంట తరువాత మా సంభాషణ నా రచనల మీద నుంచి పాలిటిక్స్ నుంచి సాంఘీక సమస్యల నుంచి షేర్స్ గుండా ప్రపంచంలోని ఇతర విషయాల దగ్గర నుండి పి.వి. నరసింహారావు నుండి హైదరాబాద్‌లో వాటర్ ప్రాబ్లమ్ వరకు మాట్లాడుకున్నాం.

చలికాలం కావటం వలన సంధ్య చీకట్లు త్వరగా అలుముకున్నాయి. చలి ఉధృతం ఎక్కువైంది. సముద్రపు జోరు కాలు కాలిన పిల్లిలా అటు ఇటు తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. రమ్య మాత్రం ఇంటికి వెళ్ళే ప్రయత్నం అసలు చెయ్యట్లేదు. తీరిగ్గా కబుర్లు చెపుతుంది.

కాని, నా మనసు మాత్రం వేరే విధంగా ఆలోచిస్తుంది. అసలే అక్కడ వాతావరణం చాలా రోమాంటిక్‌గా వుంది. అర్ధనగ్నంగా వున్న ప్రేమజంటలు ఆ ప్రాంతానికి చాలా వేడిని కలిగిస్తున్నాయి. చల్లని గాలి రివ్వు వన వీస్తుంటే వెచ్చగా... ఆహా! నాకు అత్యంత సమీపంలో ఆ అమ్మాయి... ఓహో... నా మనస్సు వుత్సాహంతో వురకలు వేసింది.

ముప్ఫయేళ్ళ యవ్వనం ఉప్పెనలా విరుచుకుపడుతుంటే నా మనస్సు నా ఆధీనంలో వుండటం లేదు. ఆమె వంటి పరిమళం తాలుకు సువాసన చిరుగాలి ద్వారా నను దరిచేరినపుడు ఎంతో హాయిగా అనిపించింది. ఆమె మాత్రం ఇవేమి గ్రహించినట్టు లేదు. ఉత్సాహంగా నేను వ్రాస్తున్న కథ గురించిఅడుగుతుంది.


అకస్మాత్తుగా వీచిన గాలికి ఆమె చున్ని నా మొహంపై పడినపుడు 'సారి' అంటూ వెనక్కి తీసుకుంది. నేను అదే చాన్సుగా ఆమె చేతిని అందుకుందామనుకున్నాను. కాని ఆమె అంతలోనే తన చేయి వెనక్కు తీసుకుంది.

మంచి అవకాశం జారవిడుచుకున్నానని లోలోపల బాధపడుతున్నపుడు 'ఏం సార్! ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు' అంది రమ్య.

'రమ్య! నే రాస్తున్న కథకు ముగింపు ఏంటో ఆలోచిస్తున్నాను' పైకి అన్నాను. కాని మనసులో మాత్రం 'చెప్పేస్తే... అమ్మో! ఒప్పుకోదేమో... ఓ సారి ట్రై చేసి చూస్తే... అయినా ఇక్కడ అంతగా పట్టించుకునే వాళ్ళు లేరు. ఆమె అరచినా అర కిలోమీటరు వరకు ఎవరూ లేరు. ఆమె అందాన్ని నా స్వంతం ఎలా చేసుకోవాలా అని నేను ప్రణాళికలు వేస్తుంటే... మా ప్రక్కన వున్న పడవలోంచి ఓ పదిమంది అమ్మాయిలు వచ్చి మమ్మల్ని చుట్టేసారు.

'హాయ్! ఫ్రెండ్స్ ఇతను నా అభిమాన రచయిత ప్రేమ్‌రాజ్ గారు! మనం కట్టుకున్న బెట్‌లో నేనే గెలిచానని మీకు ప్రత్యే

– అనిత వొజ్జల



కంగా చెప్పనవసరం లేదనుకుంటూ' అంది రమ్య.

'ఛ ఛ! వీళ్ళు ఇప్పుడే రావాలా? ఎంత మంచి అవకాశం చేజారిపోయింది' అనుకున్నాను బాధగా.

'ప్రేమ్‌రాజ్‌గారు! వీళ్ళు నా ఫ్రెండ్స్! మేమందరం కలిసి సరదగా బీచ్‌కు వచ్చాము. అనుకోకుండా మిమ్మల్ని ఇక్కడ చూశాము. మీరు ప్రేమకథలు, రొమాంటిక్ కథలు, అక్రమ సంబంధాల గురించి ఎక్కువగా రాస్తారు కాబట్టి ఒంటరిగా ఆడపిల్ల ఇలాంటి స్థలంలో కలిస్తే అల్లరి పెడతారని నా ఫ్రెండ్స్. మీరు అలా చెయ్యరని మీ కేరక్టర్ మంచిదని నేను బెట్ కట్టుకకున్నాము. ఇంతసేపు మీతో సుత్తికొట్టి మీ అమూల్యమైన సమాయాన్ని వృధా పరచినందుకు 'సారి' అండీ... ఆ! ఫ్రెండ్స్! గురుగారిది మాత్రం చాలా మంచి కంపెనీ... మన పందెం ప్రకారం మనము రేపు సెలబ్రేట్ చేసుకుందాం. వస్తామండీ' అంది రమ్య.

బిల బిల మంటూ సీతాకోకచిలుకల్లా అందరూ వెళ్ళిపోయారు.

తిరిగి తిరిగి వచ్చే అలలను... చూస్తూ... అనుకున్న కొద్దిపాటు తొందర పడితే నా పరువు ఏమై ఉండేది అని. ఇప్పుడే రచయితగా గుర్తింపు వస్తున్న నా రచనా జీవితం బహుశ అంతమైపోయేది కావచ్చు. నేను కనుక చిల్లరగా ప్రవర్తించి వుంటే... ఆ అమ్మాయి కనుక అల్లరి చేస్తుంటే... ఆ తర్వాత ఆమె స్నేహితులు వచ్చి... ఊహే ఇంత భయంకరంగా వుందే... ఇక వాస్తవం ఎంత భీతిగా వుంటుందో... ఎంత గండం గడిచిపోయిందిఈరోజు.

నేనే ఏదో పెద్ద రచయితనని... ఏదైనా సాధించగలనని, లోతుకు పాతుకుపోయిన నాలోని అహాన్ని ఆమె చెంపదెబ్బ కొట్టినట్లయింది.

పెండ్లయి ఇద్దరు పిల్లలకు తండ్రినైనా ఒంటరిగా అమ్మాయి కనిపిస్తే చాలు... అలాంటి ఊహ వచ్చినందుకు నా మీద నాకే అసహ్యం వేసింది. కొద్దిగా ఆలస్యంగానైనా నాలో పరివర్తన కలిగినందుకు సంతోష పడ్డాను. అమ్మాయిలలో అతిగా ప్రవర్తించేవారికి బహుశ నా ఉదాహరణ గుణపాఠం కావాలి అనుకున్నాను. కథ రాయడం కోసం వచ్చి... అమ్మాయి కంపెనీ దొరకగానే కథను మరచి, ఆ అమ్మాయిని ఎలా వల్లో వేసుకోవాలా అని నీచాతినీచంగా ఆలోచించిన నా కథనే... కథగా వ్రాసి అందమైన ముగింపుతో అంతం చెయ్యాలనుకొని సంతోషంగా ఆకాశంకేసి చూశానుబహు కొద్ది మందినైనా నా కథతో మార్చమని.

చిక్కగా అల్లుకున్న చీకటిలో నుంచి మెరసిపోతున్న చంద్రుడు నన్ను చూసి నవ్వుతున్నా... వెక్కిరిస్తున్నట్లే వుంది నీ కథకు ముగింపు లేదన్నట్లుగా.

◆